అంబర్‌పేట్‌లో ప్రొటోకాల్ రగడ



నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

వేదిక ముందు ఎమ్మెల్యే నినాదాలు

అంబర్‌పేట్: సన్నాహక సమావేశంలోనే ప్రొటోకాల్ రగడ ప్రారంభమైంది. బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్ నేతల పంచాయితీ షురూ అయింది. ప్రజాపాలన అభయహస్తం గ్యారెంటీలకు శ్రీకారం చుట్టిన కార్యక్రమానికి బుధవారం చే నంబర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాలులో అధికార యంత్రాంగం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో పాటు బీఆర్‌ఎస్ కార్పొరేటర్‌లు, బీజేపీ కార్పొరేటర్‌లను అధికారులు అహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ వి.హనుమంతురావుతో పాటు కాంగ్రెస్ పార్టీ తరపున పోటి చేసి రోహిణ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు హాజరయ్యారు. అంతా వేదికపైకి చేరుకున్నారు. ప్రజాపాలన కార్యక్రమం విజయవంతం కోసం అధికారులు వివరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు వేదికపై మాట్లాడాక కాంగ్రెస్ నేతలు సహితం వేదికపై మాట్లాడేందుకు ప్రయత్నించారు. దీనికి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధిలు అభ్యంతరం తెలిపారు. ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు కాకుండా సాధరణ నాయకులుగా ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. దీంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వివాదం తలెత్తింది.

వేదిక కింద ఎమ్మెల్యే నిరసన....

కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున నినాదాలు చేసి వేదికపై మాట్లాడుతుండడంతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తన కార్పొరేటర్‌లు, నాయకులతో కలిసి వేదిక ముందు నిరసనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు, మాజీ కార్పొరేటర్లు ఎలా వేదిక పంచుకుంటారని ఆయన ఆందోళన చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను సముదాయించారు. దీంతో ఎమ్మెల్యే వర్గం బయటకు వెళ్లింది. మాజీ ఎంపీ వి.హనుమంతరావు, రోహిణ్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు గడీల పాలన అనే భ్రమలో ఉన్నారని వాటి నుంచి బయటపడాలని హితవు పలికారు.

మనిషిని మనిషిగా ప్రేమించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భక్తితో పాటు మనిషిని మనిషిగా ప్రేమించినప్పుడే ఆ భక్తికి సార్థకత ఉంటుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో శంకర్‌గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప భక్తుల అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదానాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి 10 రోజుల పాటు సుమారు 300–500 మంది అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అనేది స్ఫూర్తిదాయకమన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజా సేవా కార్యక్రమాల్లో



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, గురుస్వామి శంకర్, చంద్రయ్య, చోటు, నవీన్, జనార్థన్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్‌కు అవార్డులు



సమావేశంలో పాల్గొన్న డిస్ట్రిక్ట్ 301 గవర్నర్ చక్రపాణి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య పార్కులోని వాకర్స్ ఆరోగ్య పరిరక్షణ కోసం కృషి చేయాలని డిస్ట్రిక్ట్ 301 గవర్నర్ చక్రపాణి అన్నారు. వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్‌కు బెస్ట్ క్లబ్ అవార్డు, బెస్ట్ సేవా అవార్డు, బెస్ట్ ట్రెజరర్ అవార్డులు రావడాన్ని పురస్కరించుకొని బుధవారం సుందరయ్య పార్కులో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చక్రపాణి మాట్లాడుతూ వాకర్స్ శ్రేయస్సు కోసం నిరంతరం పని చేస్తున్న ఈ క్లబ్‌కు మూడు అవార్డులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రతి వారం వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన సదస్సులు నిర్వహించి వాకర్స్‌కు విశిష్టమైన సేవలు చేశారని కొనియాడారు. వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షులు సలిపెల రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.వి.నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

కర్బన ఉద్గారాలు తగ్గించడం పరిశ్రమ లక్ష్యం కావాలి

నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ డైరెక్టర్ మోహన్ రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: కర్బన ఉద్గారాలను తగ్గించాలని పరిశ్రమలు నిర్ణయించాయని నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) కే మోహన్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా నైవేలి సంస్థ కూడా సౌర, పవన విద్యుత్ ఉత్పాదనతో పాటు పర్యావరణ మైనింగ్‌కు పెద్ద పీట వేస్తుందని తెలిపారు. ఈక్రమంలో ఇండియన్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజనీర్స్ (ఐఐఐఈ)తో ఒప్పందం చేసుకున్నామని పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఇకపై ఏ ఖనిజ పరిశ్రమైనా సరే రెండు వంతుల వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంటే మూడు వంతులు పర్యావరణానికి మేలు చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పరిశ్రమలపై ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో పర్యావరణానికి మేలు చేసే పద్ధతులను అమలు పర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఐఐఐఈ హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షులు ఎం ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. గతంలో తాము ఎన్‌టీపీసీ, కోల్ ఇండియా, బీహెచ్‌ఈఎల్ వంటి ప్రముఖ సంస్థలతో ఒప్పందం చేసుకొని పర్యావరణ అనుకూల చర్యలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఏవీవీ ప్రసాద్ రాజు, చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్ సుదర్శన్ రెడ్డి, ఆర్ శ్యాం సుందర్, సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ కుమార్ సుర్, సీనియర్ అధికారులు పవన్ కుమార్ ఆదుర్తి కృష్ణ, కేఎం మంజునాథ, డాక్టర్ ఏ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయశాఖ ఉన్నత స్థానాల్లో ముస్లింలకు ప్రాధాన్యం ఇవ్వాలి



సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ..

పంజగుట్ట: న్యాయశాఖలో ఉన్నత స్థానాల్లో ముస్లిం మైనార్టీలకు జనాభా ప్రాతిపాదికన స్థానం కల్పించాలని ది ఆల్ ఇండియా అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ మిర్జ నిస్సార్ అహ్మద్ బేగ్ ప్రభుత్వాన్ని కోరారు. గత 76 సంవత్సరాల్లో అడ్వకేట్ జనరల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పదవులు ముస్లింలకు ఇవ్వలేదని కేవలం గవర్నమెంట్ ప్లీడర్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కే పరిమితం చేశారని ఆవేదనవ్యక్తం చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నిరంగాల్లో మైనార్టీలకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. న్యాయశాఖలో కూడా తగు న్యాయం చెయ్యాలని జనాభా దామాషా ప్రకారం న్యాయశాఖ ఉన్నత స్థానాల్లో తమకు స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

6 డివిజన్లలో 24 కేంద్రాలు

ముషీరాబాద్‌లో నేటి నుంచి ప్రజా పాలనకు ఏర్పాట్లు పూర్తి



ముషీరాబాద్: కొత్తగా అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా హామీలను నెరవేర్చేందుకు ఈ నెల 28 నుంచి ప్రజా పాలన పేరుతో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తుంది. జనవరి 6వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాట్లను చేశారు.

నియోజకవర్గంలో 24 కేంద్రాలు...

ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌లలో ఒక్కో డివిజన్‌కు నాలుగు కేంద్రాల చొప్పున 24 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వారికి సూపర్‌వైజింగ్ ఆఫీసర్లు, ఆఫీస్ అసిస్టెంట్లు ఏడుగురిని నియమించారు.

- అడిక్‌మెట్ డివిజన్‌లో అడిక్‌మెట్ వార్డు ఆఫీస్, ఎస్ఆర్‌టి కమ్యూనిటీ హాల్, అంబేద్కర్ కమ్యూనీటిహాల్, లలితానగర్ కమ్యూనిటీహాల్
- ముషీరాబాద్ డివిజన్‌లో ముషీరాబాద్ వార్డు ఆఫీస్, మోహన్‌నగర్ కమ్యూనిటీహాల్, వెస్ట్ ఎంసీహెచ్ కాలనీ, బహదూర్‌యార్ జంగ్ ఫంక్షన్ హాల్
- రాంనగర్ డివిజన్‌లో నైబర్‌హుడ్ కమ్యూనిటీహాల్, ఎస్ఆర్‌టీ పార్కు కమ్యూనిటీ హాల్, పోచమ్మగుడి, రాజీవ్‌గాంధీ కమ్యూనిటీహాల్
- భోలక్‌పూర్ డివిజన్‌లో గంగపుత్ర సంఘం, మహాత్మనగర్ కమ్యూనిటీ హాల్, అంజుమన్ స్కూల్
- గాంధీ నగర్ డివిజన్‌లో వీవీగిరినగర్ కమ్యూనిటీహాల్, జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్, గాంధీనగర్ వార్డు ఆఫీస్, అశోక్‌నగర్ కల్చరల్ అసోసియేషన్‌లను కేంద్రం
- కవాడిగూడ డివిజన్‌లో కవాడిగూడ వార్డు ఆఫీస్, దోమలగూడ వార్డు ఆఫీస్, బండమైసమ్మ కమ్యూనిటీహాల్, అంగన్‌వాడీ కేంద్రం ముగ్గుబస్తీ కమ్యూనిటీహాల్

సదస్సుకు మంత్రికి ఆహ్వానం



మంత్రిని ఆహ్వానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అంబర్‌పేట్: బ్రాహ్మణుల ఐక్యత, సంక్షేమానికి కోసం ఈనెల 30న నిర్వహించే రాష్ట్రస్థాయి సదస్సుకు హాజరు కావాల్సిందిగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును రాష్ట్ర బ్రాహ్మణ ఆఫీషియల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. బుధవారం మంత్రి కార్యాలయంలో కలిసి సదస్సుకు సంబంధించిన ఆహ్వానపత్రాన్ని అందించారు. నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలో ఈ సదస్సు నిర్వహిస్తామన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కన్వీనర్ పీవి రాంచందర్‌రావు, ప్రతినిధులు వెంకటరమణ, సీతారామయ్య, బానుశర్మ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కాచిగూడ: మెడికవర్ హాస్పిటల్స్ బేగంపేట బ్రాంచి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. వివిధ విభాగాలకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొని రోగులకు బీపీ, షుగర్, బాడీ మాస్ ఇండెక్స్, ఈసీజీ, ఐ చెకప్, డెంటల్ చెకప్ తదితర వైద్య సేవలను అందించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మరికొంతమంది వైద్య సలహాలు, సేవలను అందుకున్నారు.

ఘనంగా బాపు జయంతి

చిక్కడపల్లి: కళానిలయం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రముఖ దర్శకులు, చిత్రకారుడు బాపు 90 వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి మాట్లాడుతూ సినిమాలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. బాపుదర్శకత్వంలో వచ్చిన ముత్యాలముగ్గు, శ్రీరామరాజ్యం వంటి సినిమాలు తరాల పాటు ప్రజలను ప్రభావితం చేస్తాయన్నారు. ప్రముఖ చిత్రకారుడు, నృత్య రూపకాల రచయిత భ్నిం(భవిడిపల్లినరసింహమూర్తి)ని, బాపు పరిచయం చేసిన సుదర్శన్‌లను సత్కరించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన మేరకు.. ఫలక్‌నుమా – ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (30) రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ జన సమితి సభ్యులు

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం చేపట్టిన ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ జన సమితి ముషీరాబాద్ ఇన్‌చార్జీ ఎం.నరసయ్య విజ్ఞప్తి చేశారు. బుధవారం అడిక్‌మెట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలుగా తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయలేదని దీనితో చాలా మంది పేదలు తెల్లరేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. దీంతో పాటు అర్హులైన మహిళలకు మహాలక్ష్మి, 500 రూపాయలకు గ్యాస్, వృద్ధాప్య పెన్షన్ పథకం, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముషీరాబాద్ తెలంగాణ జన సమితి కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్, అడిక్‌మెంట్ డివిజన్ అధ్యక్షులు కాకునూరు సుధాకర్ పాల్గొన్నారు.

డాక్టర్ అంజయ్య సేవలు మరువలేనివి

కవాడిగూడ: రజకులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించిన మహోన్నత వ్యక్తి, రజక (ధోబి) అభివృద్ధి సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మండలపు అంజయ్య సేవలు మరువలేనివని, వారి ఆశయ సాధన కోసం యువత పాటుపడాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు ఎం.పి డాక్టర్ కె. లక్ష్మణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌లు పిలుపునిచ్చారు. డాక్టర్ ఎం అంజయ్య ద్వితీయ వర్థంతిని పురస్కరించుకొని లోయర్ ట్యాంక్‌బండ్‌లోని షిర్డి సాయిబాబా ఆలయం వద్ద తెలంగాణ రజక (ధోబి) అభివృద్ధి సంస్థ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అంజయ్య నిత్యం సమాజ శ్రేయస్సు కోసం పరితపించేవారని గుర్తుచేశారు. తెలంగాణ రజక (ధోబి) అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మరాజు కృష్ణమూర్తి, వర్కింగ్ చైర్మన్ మండలపు గాంధీ పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్లు, అధికారులు

చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజకవర్గంలో ఆరు గ్యారంటీల అమలు కోసం నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా బుధవారం చిక్కడపల్లి మహిళా భవన్‌లో మావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్లు, అధికారులు హాజరు అయ్యారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన పథకాలను సద్వినియోగం చేసుకోవడానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. సర్కిల్–15 డీఎంసీ తిప్పర్తి యాదయ్య మాట్లాడుతూ నియోజవర్గంలోని ఆరు డివిజన్‌లలో ప్రతి డివిజన్‌కు 4 ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రజా పాలన ముషీరాబాద్ నియోజవర్గం ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, సర్కిల్ అడిషనల్ కమిషనర్లు ప్రవీణ్ చంద్ర జాకీర్ హుస్సేన్, ముషీరాబాద్ ఎమ్మార్వో వెంకట్ లక్ష్మీ పాల్గొన్నారు.

తెలంగాణ ఆర్ట్ సొసైటీ ఆవిర్భావం



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ ప్రతినిధులు

పంజగుట్ట: కళాకారులను అందర్నీ ఒక్క వేదికపైకి తీసుకువచ్చేందుకు తెలంగాణ ఆర్ట్ సొసైటీ ప్రారంభిస్తున్నట్లు సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సొసైటీ ఆవిర్భావ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు ఎస్.మధుమోహన్, విద్య వెంకట్, డి.వి.రమణలు మాట్లాడారు. ప్రస్తుత తరుణంలో టెక్నాలజీ పెరిగి కళాకారులకు ప్రాధాన్యత తగ్గుతుందని దీంతో వారి ఆర్థిక పరిస్థితి దుర్భరమౌతోందని ఆవేదనవ్యక్తం చేశారు. కళాకారుల ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ ఆర్థికస్థితి గతులను మెరుగుపరుచుకుని రాబోయే తరాలను కూడా ఉత్తేజపరచడం సంఘం లక్ష్యమన్నారు.

నామినేటెడ్ పదవులపై ఉద్యమ విద్యార్థి నేతల ఆశలు!

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల పై ఉద్యమ విద్యార్థి నేతలు ఆశలు పెట్టుకున్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి పోరాడి రాష్ట్ర అవతరణ అనంతరం ఉద్యోగాల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పై పోరాడిన ఓయూ విద్యార్థి నేతలు చనగాని దయాకర్‌గౌడ్, లోకేష్ యాదవ్, వరంగల్ రవి, ఉదయ్‌కుమార్, బాలలక్ష్మీ, దుర్గం భాస్కర్, కొనగాల మహేష్ తదితరులు నామినేటెడ్ పదవుల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు ఎమ్మెల్యే టిక్కెట్ కోసం ఎస్సీ, ఎస్టీలు రూ.25 వేలు, బీసీ, ఓసీలు రూ.50 చెల్లించి దరఖాస్తు చేసుకొని చివరి రోజు వరకు ఎదురు చూసి ఓయూ విద్యార్థి నేతలు భంగపడ్డ పడ్డారు. టిక్కెట్ దక్కలేదని అసంతృప్తి చెంది తీవ్ర మనస్తాపంతో కోటూరి మానవత రాయ్, కురవ విజయ్‌కుమార్ కాంగ్రెస్ నాయకుల పై అనేక ఆరోపణలు చేసి పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. మరికొందరు విద్యార్థి నేతలు నామినేటెడ్ పదవుల ఆశతో పాటు పార్టీ పెద్దల బుజ్జగింపు మేరకు కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ నెల 7న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి రోజు మంత్రులు, పార్టీ ముఖ్య నేతల దర్శనం కోసం విద్యార్థి నేతలు సచివాలయం, ఇతర కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్నారు. టీపీసీసీ కూడా ఓయూ విద్యార్థి నేతల పేర్లను నామినేటెట్ పదవుల పరిశీలించినట్లు పత్రికల్లో రావడంతో మరింత ఉత్సాహంతో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నగర మేయర్‌తో పాటు రెండు ఎమ్మెల్యేలు, 8 నామినేటెట్ పదవులలో ఓయూ విద్యార్థి నేతలను నియమించినట్లు ఓయూ కాంగ్రెస్ పక్ష విద్యార్థి నేతలు గుర్తు చేశారు.

డాక్టర్ ప్రతిభాలక్ష్మికి పలువురి అభినందన



కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి ఎన్నికల్లో సభ్యురాలిగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన మొట్టమొదటి ఏకైక మహిళ డాక్టర్ ప్రతిభాలక్ష్మీ ముదిరాజ్‌ని బుధవారం ఆల్ ఇండియా ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆమెను కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. ముదిరాజ్‌ల అణిముత్యం ప్రతిభాలక్ష్మీ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నతశిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

ఆరు గ్యారంటీలు పటిష్టంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రభుత్వం చేపట్టబోయే ఆరు గ్యారెంటీల పథకాలను ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి.స్కైలాబ్‌బాబులు కోరారు. బుధవారం చిక్కడపల్లిలోని కేవీపీఎస్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజా పాలనను పారదర్శకతన అమలు చేయడంతో పాటు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ మంత్రిని నియమించాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున, ఎస్.మనోహర్, మాణిక్యం, కుమార్, రాజు, సురేష్, రాధాకృష్ణ, వంగూరి రాములు, అడవయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశ భక్తి కలిగి ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: ప్రతి ఒక్కరూ దేశ భక్తి కలిగి ఉండాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం నల్లకుంట శివానంద్ నగర్‌లో వందే ప్రజ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన నిత్య జనగణమన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జాతీయ జెండా ఎగుర వేసి మాట్లాడారు. వందే ప్రజ ఆధ్వర్యంలో గత 600 రోజులుగా నిత్య జనగణమన కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయమన్నారు.

కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన

నల్లకుంట: బస్తీలు, కాలనీలలో నిర్మించే సామాజిక భవనాలు స్థానికుల అవసరాలకు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బుధవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్‌లో రూ.40 లక్షలతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కాలేరు మాట్లాడారు. బస్తీ వాసులు వినతి మేరకు ఎమ్మెల్యే బడ్జెట్ ద్వారా నిధులు మంజూరు చేయించి కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని చెప్పారు.

నేరెళ్ల వేణుమాధవ్‌కు నివాళి

చిక్కడపల్లి: మిమిక్రీని శాస్త్రీయ కళగా తెలుగు విశ్వవిద్యాలయంలో బోధనాంశంగా నెలకొల్పేందుకు నేరెళ్ల వేణుమాధవ్ చేసిన కృషి విస్మరించలేమని ప్రముఖ నటుడు, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం శ్రీ త్యాగరాయగానసభలో మిమిక్రీ అర్టిస్ట్స్ ఫేర్ అసోసియేషన్ గానసభ సంయుక్త నిర్వహణలో ప్రముఖ మిమిక్రీ కళాకారుడు డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ జయంతి సందర్భంగా మిమిక్రీ పోటీలు నిర్వహించారు. సుమారు వందకు పైగా కళా కారులు పోటీలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా శివారెడ్డి పాల్గొని తన నటనకు దోహదపడిందని వివరించారు. సంస్థ అధ్యక్షుడు చంద్రముఖి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు బీసీ కులగణనను వెంటనే చేపట్టాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడ, మోతీమార్కెట్‌లోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీసీల జనాభా ప్రకారం ఎన్నికలలో రిజర్వేషన్లు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బీసీ నేతలు డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, భూషన్ భాస్కర్, ప్రదీప్ గౌడ్, నల్లెల కిషోర్ పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. అప్రమత్తతే ప్రధానం

గాంధీఆస్పత్రి: గత వారం రోజుల వ్యవధిలో గాంధీ ఆస్పత్రి అవుట్ పేషెంట్ విభాగంలో ఎనిమిది కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు కాగా, స్వల్ప లక్షణాలతో నలుగురు పూర్తిస్థాయిలో కోలుకోగా, స్వీయ నియంత్రణలో ఉన్న మిగిలిన వారిని గాంధీ వైద్యులు ప్రతిరోజు ఫోన్ ద్వారా మాట్లాడి పర్యవేక్షణ చేస్తున్నారు. లక్షణాలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేసుకోవాల్సిన మందులను సూచిస్తున్నారు. పాజిటివ్ వచ్చిన రోగుల కుటుంబ సభ్యులకు కోవిడ్ టెస్ట్‌లు చేయగా అందరికీ నెగిటివ్ రావడం గమనార్హం. ఈ సందర్భంగా గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు బుధవారం పలు అంశాలపై మాట్లాడారు.

- ఒమిక్రాన్ సబ్ వేరియంట్ అయిన జేఎన్–1 సెల్ఫ్ లిమిటింగ్ వైరస్ అని, సోకిన ఐదు నుంచి ఏడు రోజుల్లో దానంతట అదే తగ్గిపోతుందన్నారు. రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారు, బాలింతలు, గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాల రుగ్మతలతో బాధపడేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు.
- ఈనెల 19వ తేది నుంచి 27వ వరకు గాంధీ ఓపీ విభాగంలో ఎనిమిది కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు కాగా, నలుగురు కోలుకోగా, మిగిలినవారు స్వీయ నియంత్రణలో ఉన్నారని, వారితో ప్రతిరోజు ఫోన్ ద్వారా మాట్లాడుతున్నామన్నారు.
- రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రులు నుంచి 59 కోవిడ్ పాజిటివ్ కేసులు నమూనాలు నోడల్ కేంద్రమైన గాంధీ ఆస్పత్రికి వచ్చాయని, వీటిని జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం ఉప్పల్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్‌కు పంపినట్లు తెలిపారు.
- గాంధీ మెడికల్ కాలేజీ మైక్రోబయోలజీ వైరాలజీ ల్యాబ్‌లో అధునాతన వైద్య యంత్రాలు, నిపుణులు అందుబాటులో ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం ఆదేశించి, రీఏజెంట్స్ (అవసరమైన ద్రావకాలు) పంపిస్తే ఇక్కడే జీనోమ్ సీక్వెన్సింగ్ చేపడతామన్నారు. సెకెండ్, థర్డ్ వేవ్‌లలో జీనోమ్ సీక్వెన్సింగ్ చేసిన అనుభవం ఉందన్నారు.
- రెండ్రోజుల క్రితం ఓ ఆస్పత్రిలో ర్యాట్ టెస్ట్ చేయించుకుంటే కోవిడ్ పాజిటివ్ రాగా, సదరు బాధితుడు గాంధీ ఆస్పత్రికి వస్తే ఆర్‌టీపీసీఆర్ టెస్ట్ చేయగా నెగిటివ్ వచ్చిందన్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారు తప్పరి సరిగా ఆర్‌టీపీసీఆర్ టెస్ట్ చేయించుకోవాలని, గాంధీ ఆస్పత్రిలో ఉచితంగా అన్నిరకాల వైద్యపరీక్షలు చేస్తున్నామన్నారు.